పని చేయని ఎత్తిపోతల పథకం

- 890 ఎకరాలకు సాగు నీరు అందించేలా ఊటుకూరు లిఫ్ట్
- నిర్వహణ లోపంతో నిలిచిపోయిందంటున్న రైతులు
- గత కొన్ని సంవత్సరాలుగా మరమ్మతులకు నోచుకోని వైనం



నిలిచిపోయిన ఊటుకూరు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం

ఊటుకూరు(క్రోసూరు): రైతుల పొలాలకు నిరంతరం సాగునీరు అందిస్తామని, పంటలు సస్య శ్యామలం చేసి రైతుల అభివృద్ధికి కృషి చేస్తామని పాలకులు చెప్పటమే కానీ వాస్తవంగా కార్యరూపం దాల్చేందుకు సంవత్సరాలు పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఊటుకూరు గ్రామంలో 890 ఎకరాలకు సాగు నీరు అందించేందుకు లక్షల రూపాయలు ఖర్చు చేసి మూడు దశాబ్దల క్రితం ఊటుకూరు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం (ఎత్తిపోతల పథకం) ఏర్పాటు చేశారు. తొలి నాళ్లలో బాగా నడిచినా గత కొన్ని సంవత్సరాలుగా మరమ్మతులకు గురై మూత పడింది. ఈ స్కీంకు దగ్గరలోని బయ్యవరం ఎద్దువాగు నుంచి ఊటుకూరు, మునుగోడు, విప్పర్ల, బయ్యవరం గ్రామాల్లోని 890 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు దీనిని నిర్మించటం జరిగింది. గతంలో ఎంతో బాగా నడిచినప్పటికీ ఎత్తిపోతల పథకం గత కొన్ని సంవత్సరాలుగా మరమ్మతులకు నోచుకోక నిలిచిపోయింది.

నిర్వహణ లోపం వల్లే...

ఎత్తిపోతల పథకం ప్రధానంగా నిర్వహణ లోపం వల్ల నిలిచిపోయినట్లు రైతులు చెబుతున్నారు. స్కీం కింద ఉన్న పొలాల రైతులందరికీ నీళ్లు అందకపోవడంతో రైతులందరూ నిర్వహణకు కలిసి రాకపోవటంతో నిర్వహణ లోపం ఏర్పడిందని, దీంతో స్కీంలోని యంత్ర పరికరాలు, ట్రాన్స్‌ఫార్మర్లు పాడై నిలిచిపోయిందని రైతులు అంటున్నారు. ఎత్తిపోతల పథకం నిలిచిపోవడంతో ఆయకట్టు రైతులు పొలాల్లో సాగు చేపట్టడం లేదు. బోర్లు వేసుకునే స్థోమత ఉన్న రైతులు మాత్రం బోర్లు వేసుకుని పంటలు సాగు చేస్తున్నారు. మిగిలిన వారు పంటలు సాగే చేపట్టడం లేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఇటీవల నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించింది. దీంతో నీటి సంఘాల ఆధ్వర్యంలోనైనా లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం మరమ్మతులు చేపడతారేమోనని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఎత్తిపోతల పథకంకు నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తేవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



స్కీం కింద కాలువ

రూ.50 లక్షలు అవసరం

నీటి సంఘాలు ఎన్నిక కావటంతో ఇటీవల స్కీం కింద కాలువలను బాగు చేశారు. అయితే లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం మరమ్మతులు చేసేందుకు రూ.50 లక్షలు ఖర్చు అవుతుందని ఏపీఎస్ఐడీసీ (ఏపీ నీటిపారుదల అభివృద్ధి సంస్థ)కి అధికారులు అంచనా నివేదిక అందజేశారు. ఉన్నతాధికారులకు అందజేశాం. నిధులు మంజూరైతే తక్షణమే మరమ్మతులు చేసి స్కీం అందుబాటులోకి తెస్తాం.

– శంకరరావు, డీఈఈ, ఏపీఎస్ఐడీసీ

నాకు 8 ఎకరాలుంది



నాకు స్కీం కింద ఎనిమిది ఎకరాలుంది. స్కీం ద్వారా నీళ్లు రాకపోవటంతో పంటలు వేయటం లేదు. గతంలో నీటిపారుదల సంస్థ అధికారులను బాగు చేయాలని అడిగితే రైతులు సొంతంగా బాగు చేసుకోవాల్సిందేనన్నారు. రైతులందరు కలిసి రాకపోవటంతో స్కీం గురించి పట్టించుకోలేదు.

– జన్నవరపు శ్రీనివాసరెడ్డి, ఊటుకూరు మాజీ సర్పంచ్

నాకు ఎకరం ఉంది



ఊటుకూరు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం కింద నాకు ఎకరం పొలం ఉంది. నీళ్లు రాకపోవటంతో ప్రస్తుతం పంటలు సాగు చేయటం లేదు. స్కీం బాగు చేసి సాగునీరు ఇస్తే మళ్లీ సాగు చేసుకుంటాం.

– అల్లురెడ్డి, ఊటుకూరు, క్రోసూరు మండలం

రెండు మోటార్లు పెట్టాం



నాకు స్కీం కింద 14 ఎకరాల పొలం ఉంది. స్కీం నుంచి నీళ్లు రాకపోవటంతో బోర్లు వేసి రెండు మోటార్లు పెట్టాం. కొంత మాగాణి, కొంత మెట్ట సాగు చేస్తున్నాం.

– శాఖమూరి ఏడుకొండలు, ఊటుకూరు, క్రోసూరు మండలం

క్లుప్తంగా

పీహెచ్‌సీ వైద్యాధికారులు బాధ్యతల స్వీకారం





బెల్లంకొండ: మండలంలోని చంద్రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నూతనంగా బదిలీపై వచ్చిన వైద్యాధికారులు బాధ్యతలను స్వీకరించారు. గుంటూరు వైద్య కళాశాల నుంచి వచ్చిన డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ దీపిక బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ అనారోగ్య సమస్యలపై వైద్యశాలకు వచ్చిన వారికి సత్వరమే మెరుగైన వైద్య సేవలు అందించేలా కృషి చేస్తామని తెలిపారు. అనంతరం వైద్యశాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రసూన్న



పెదకూరపాడు: ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎం.ప్రసూన్న సూచించారు. పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని, సిజేరియన్లు పూర్తిగా తగ్గించాలన్నారు. కొత్తగా విధుల్లోకి చేరిన గైనకాలజిస్ట్ డాక్టర్ కే సుజాత స్పెషలిస్ట్ సేవలు ప్రజలకు ఉపయోగపడేటట్టు ఆశ వర్కర్లు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ విద్య ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో అయోధ్యస్వామికి పూజలు



పెదకూరపాడు: మండల పరిధిలోని 75 తాళ్లూరు గ్రామంలో అవధూత అయోధ్య స్వామి ఆశ్రమంలో మంగళవారం మాస శివ రాత్రి పురస్కరించుకొని వేద పండితులు ఆదిత్య శర్మ ఆధ్వర్యంలో అయోధ్యస్వామి ఉత్సవ విగ్రహానికి, శివలింగానికి గణపతి పూజ, పంచామృత అభిషేకాలు, రుద్రాక్షలు, 20 రకాల పూలతో ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించారు. ఏ గ్రామంలో మాస శివరాత్రి నిర్వహిస్తారో ఆ గ్రామంలో ఆయురారోగ్యాలు, పాడి పరిశ్రమ అభివద్ధి చెందుతాయని వేద పండితులు ఆదిత్య శర్మ అన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల అందజేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమం కమిటీ నిర్వాహకులు తాటి కోటేశ్వరమ్మ రామకృష్ణ, భారతి వెంకయ్య స్వామి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో అన్నదానం



సత్తెనపల్లి: అన్ని దానాలలో అన్నదానం గొప్పదని, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే కాకుండా మెరుగైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వాల్మీకి సంఘం నాయకులు పిక్కిలి రత్తయ్య అన్నారు. అమ్మ చేయూత చారిటబుల్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని రైల్వే స్టేషన్, తాలూకా సెంటర్‌లోని అన్నార్తులకు మహమ్మద్ జానీ, ముంతాజ్ బేగం వివాహ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రెసిడెంట్ కుమ్మరి దస్తగిరి, సభ్యులు షేక్ చిన్న షరీఫ్, పిల్లుట్ల ఆంజనేయులు, పి.శివ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వారాహి నవరాత్రులు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

సత్తెనపల్లి: పట్టణంలోని భవిష్య పాఠశాల సమీపంలోని త్రిశక్తి దుర్గాపీఠంలో వేంచేసి యున్న దుర్గామాతని వారాహిదేవిగా అలంకరించి ఈ నెల 26 నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు వారాహి నవరాత్రులు అత్యంత వైభవంగా నిర్వహించడం జరుగుతుందని పీఠాధిపతి వెలిదండ్ల హన్మత్ స్వామిజీ మంగళవారం తెలిపారు. ప్రతి రోజు వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చనలు, తీర్థప్రసాద వితరణ జరుగుతాయన్నారు. జూలై 5న ఆఖరి రోజు భక్తులకు అన్న ప్రసాద వితరణ చేపట్టనున్నామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

పంచముఖీ వేద గాయత్రి ఆలయంలో...

పట్టణంలోని శ్రీశ్రీశ్రీ ఫీరోజి రుషీంద్రుల మఠంలోని పంచముఖీ వేద గాయత్రి అమ్మవారి ఆలయంలో ఈ నెల 26 నుంచి జూలై 4 వరకు వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించబడతాయని వేద గాయత్రి పరివార్ బాధ్యులు మంగళవారం తెలిపారు. ప్రతి రోజు ఉదయం 7:30 గంటలకు వారాహి హోమం, సాయంత్రం 6 గంటలకు అర్గళా స్తోత్ర పారాయణం, షోడశోపచార పూజ, అమ్మవారి లీలా వైభవ సత్సంగం జరుగుతాయన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

నకరికల్లు ఉన్నత పాఠశాలకు మూడు ట్రిపుల్ ఐటీ సీట్లు



వేముల వెన్నెల



పెద్దినీడి మల్లిఖార్జునరావు



లోకిరెడ్డి లక్ష్మీప్రసన్న

నకరికల్లు: ట్రిపుల్ ఐటీలో నకరికల్లు ఉన్నత పాఠశాల విద్యార్థులు ముగ్గురు సీట్లు సాధించారు. పదో తరగతిలో 582 మార్కులు సాధించిన వేముల వెన్నెలకు ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో, 581 మార్కులు సాధించిన పెద్దినీడి మల్లిఖార్జునరావుకు నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు లభించింది. 577 మార్కులు సాధించిన లోకిరెడ్డి లక్ష్మీప్రసన్నకు ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు లభించింది. తమ పాఠశాల నుంచి ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులను పూర్వ ప్రధానోపాధ్యాయుడు తుర్లపాటి నగేష్, ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు జాలాది శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

మండలంలో ఐదుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపిక

రాజుపాలెం: మండలంలో వివిధ జిల్లా పరిషత్ పాఠశాలల నుంచి ఐదుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఎంఈవో-1 మల్లికార్జునశర్మ మంగళవారం తెలిపారు. 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి ఈ అవకాశం వచ్చినట్లు ఆయన తెలిపారు. గణపవరం జిల్లా పరిషత్ పాఠశాల నుంచి మెరుగు హాసిని, మెరుగు హరిణి, రాజుపాలెం జిల్లా పరిషత్ పాఠశాల నుంచి మద్దు పవిత్రమేరి నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని, నవోదయ హైస్కూల్ నుంచి శీలం ఈశ్వర్ ఒంగోలు ట్రిపుల్ ఐటీకి, అనుపాలెం జిల్లా పరిషత్ పాఠశాల నుంచి ఎం.కళ్యాణ్‌రెడ్డి ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు తెలిపారు. ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులకు ఆరు సంవత్సరాలు ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పించబడునని ఆయన తెలిపారు.



మెరుగు హరిణి



మెరుగు హాసిని



శీలం ఈశ్వర్



మద్దుపవిత్రమేరి



ఎం.కళ్యాణ్‌రెడ్డి

చీకట్లోనే దొడ్లేరు ఎస్సీ కాలనీ..!



వెలగని వీధి దీపాలు

దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరు ఎస్సీ కాలనీలో గత మూడు నెలలుగా వీధి దీపాలు వెలగకపోవడంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో మూడు నెలలుగా ఎస్సీ కాలనీ చీకట్లోనే ఉంది. పంచాయతీ కార్యదర్శి వెంకయ్యను అనేకసార్లు అడిగినా ఫలితం లేదని కాలనీ వాసులు అంటున్నారు.

కౌలు రైతులు పంట సాగు హక్కు పత్రాలు పొందాలి



నందిగామలో మాట్లాడుతున్న ఏవో సుబ్బారెడ్డి



నార్నెపాడులో మాట్లాడుతున్న ఏవో శ్రీధర్‌రెడ్డి



నకరికల్లులో మాట్లాడుతున్న ఏవో దేవదాసు

సత్తెనపల్లి: కౌలు రైతులు అందరూ తమ గ్రామంలోని రైతు సేవా కేంద్రాల ద్వారా భూ యజమానుల అంగీకారంతో పంట సాగు హక్కు పత్రాలు పొందాలని సత్తెనపల్లి మండల వ్యవసాయ ధికారి బి.సుబ్బారెడ్డి అన్నారు. సత్తెనపల్లి మండలం నందిగామలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రస్తుతం పత్తి, మిరప, వరి పంటలు సాగు చేసే రైతులు తప్పనిసరిగా పచ్చిరొట్ట పైరులయిన జనుము, జీలుగ, పిల్లి పెసర సాగు చేసుకొని పూత దశలో భూమిలో కలియ దున్నుకోవాలన్నారు. రైతులు అందరూ అధీకృత డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. మిరప సాగు చేసే రైతులు షేడ్‌నెట్‌లలో నారు పెంచుకోవాలని, ఇలా పెంచుకోవటం వలన ఆరోగ్యవంతమైన మిరప నారు, తెగుళ్ల, పురుగుల తాకిడి తగ్గించవచ్చన్నారు. ఆఖరి దుక్కిలో ఫాస్ఫరస్ ఎరువులు వేసుకోవాలన్నారు. జీవన ఎరువులైన ఫాస్ఫరస్ సాలుబులైజింగ్ బాక్టీరియా, అజోల్లా, వామ్ జీవన ఎరువులు వాడుకొని రసాయనిక ఎరువుల వాడకం తగ్గించుకోవాలన్నారు. తొలకరి వర్షాలకు నవ ధాన్యాలను సాగు చేసుకొని పూత దశలో భూమిలో కలియ దున్నుకోవాలన్నారు. దీని వలన భూమిలో సూక్ష్మజీవులు బాగా వృద్ధి చెంది భూమి సారవంతం అవుతుందన్నారు. కార్యక్రమంలో నందిగామ గ్రామ నాయకులు, రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది

నార్నెపాడు(ముప్పాళ్ళ): మండలంలోని నార్నెపాడు, పలుదేవర్లపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం జరిగింది. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎస్.శ్రీధర్‌రెడ్డి పాల్గొని పత్తి, మిరప, వరి పంటలు సాగు చేసే రైతులు తప్పనిసరిగా పచ్చిరొట్ట పైరులు సాగు చేసుకోవాలని సూచించారు. కౌలు రైతులు రైతు సేవా కేంద్రం ద్వారా భూ యజమానుల అంగీకారంతో సాగు హక్కు పత్రాలు పొందాలని సూచించారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా అర్హత కలిగిన రైతుల వివరాలు ఈ కేవైసీ ఆటో అప్‌డేట్ చేయటం జరిగిందన్నారు. విత్తనాలు లైసెన్స్ ఉన్న డీలరు వద్దే కొనుగోలు చేయాలన్నారు. తగిన రశీదు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది ప్రియాంక, శ్రీనివాసరావు, ఏఈవో వి.నారాయణ, రైతులు పాల్గొన్నారు.

కౌలు రైతులు ధ్రువీకరణ పత్రాలు పొందాలి

నకరికల్లు: వాస్తవ కౌలు రైతుదారులు కౌలు రైతు గుర్తింపు కార్డులు పొందాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సూచించారు. మండలంలోని నకరికల్లు, శివాపురంతండా గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోను వీఆర్వో వద్ద కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందడం ద్వారా ప్రభుత్వ రాయితీలు, వ్యవసాయ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. కౌలుకు చేస్తున్న పొలం పట్టాదారు పాస్‌పుస్తకం, భూ యజమాని ఆధార్‌కార్డు, కౌలు రైతు ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోతో వీఆర్వోలను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు షేక్.సుభాని, వై.ప్రభాకర్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

అంచులవారిపాలెంలో పొలం పిలుస్తోంది

రాజుపాలెం: మండలంలోని అంచులవారిపాలెం రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. దుక్కులు దున్నిన పొలాల్లో పోషక లోపాలను సవరించుకోవడం కోసం రైతులందరు జింక్ ధాతు, జిప్సం లోపాలు ఉన్న వాటిని సవరించుకున్నట్లయితే పైరు బాగా ఏపుగా పెరిగి మంచి దిగుబడులు వస్తాయని తెలిపారు. రైతులు విచక్షణా రహితంగా ఎరువులు వాడడం వలన పైరులు దెబ్బతినే ప్రమాదం ఉందని అన్నారు. సేంద్రియ ఎరువులను ఎక్కువగా వాడాలని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ సుచరిత, అభ్యుదయ రైతులు తదితరులు పాల్గొన్నారు.

పంట సాగు ధ్రువీకరణ పత్రాలతో రైతులకు ప్రయోజనం



మాట్లాడుతున్న ఏవో అరుణకుమారి

బెల్లంకొండ: పంట సాగు ధ్రువీకరణ పత్రాలతో రైతులకు ప్రయోజనం చేకూరుతుందని మండల వ్యవసాయాధికారి అరుణకుమారి తెలిపారు. మండలంలోని వెంకటాయపాలెం గ్రామంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు సాగు చేసే పంటకు గుర్తింపు కార్డులను పొందవచ్చన్నారు. తద్వారా ప్రకృతి వైపరీత్యాల సమయంలో నష్ట పరిహారాన్ని పొందవచ్చన్నారు. అదే విధంగా కౌలు రైతులకు గుర్తింపు కార్డులను అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు తమ పొలాలను ముందస్తుగా దుక్కులు దున్నించాలని అన్నారు. వ్యవసాయ శాఖ అనుమతులు ఇచ్చిన విత్తనాలనే కొనుగోలు చేయాలని సూచించారు. పచ్చిరొట్ట విత్తనాలను సబ్సిడీ ద్వారా అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మేకం భాస్కర రావు, మాజీ సర్పంచ్ మేకం శ్రీరామమూర్తి, ఎంపీఈవో రహ్మతుల్లా, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్య వివరాలు నమోదు చేయాలి



మాట్లాడుతున్న వైద్యాధికారి రమాదేవి

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వివరాలను సంబంధిత యాప్‌లో నమోదు చేయాలని పీహెచ్‌సీ వైద్యులు పీ రమాదేవి చెప్పారు. మండల కేంద్రమైన ముప్పాళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బందికి మంగళవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు రమాదేవి మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. పుట్టుకతో వచ్చే లోపాలు, ఆరోగ్య సమస్యలు, ఎదుగుదలలో లోపాలున్న వారిని గుర్తించటం, కంటి, పంటి సమస్యలను గుర్తించి వారి వివరాలను ఆర్‌బీఎస్‌కే యాప్‌లో నమోదు చేయాలన్నారు. 20 మంది కంటే ఎక్కువ మంది పిల్లలు ఆరోగ్య సమస్యలున్నట్లుగా గుర్తించినట్లయితే సంబంధిత నిపుణులైన వైద్యులతో కూడిన వాహనం నేరుగా ఆయా పాఠశాలల్లో, తక్కువ ఉన్నట్లయితే జిల్లా ఆసుపత్రిలో వైద్య సేవలందించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో దస్తగిరి, సూపర్‌వైజర్ పీటర్ డేమియన్, ఆయా గ్రామాల ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) సత్తెనపల్లి వారి కోర్టులో

E.P. No: 19/2022 O.S.No: 318/2016

Between:-

సోముల సుబ్బారావు -D.H.R

And

ఎద్దులదొడ్డి విజయకుమార్ -J.D.R

పై నెంబరు దావాలో డిక్రీని బట్టి డిక్రీ హోల్డర్ కేన బాకీని రాబట్టుకొనుటకు J.D.R కు చెందినట్టి పైలు జప్తీకాబడిన ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిపై అమలు చర్యలు చేపట్టియుండగా శ్రీకోర్టువారు బహిరంగ వేలము జరుపుటకు నిర్ణయించియున్నారు.

షెడ్యూలు:-గుంటూరు జిల్లా ప్రస్తుతం పల్నాడు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, సత్తెనపల్లి సబ్ రిజిస్ట్రేషన్ ఇలాకా, సత్తెనపల్లి టౌన్,D.No:188, Ac 56.57 సెంట్లలో, 7వ వార్డు,కట్టమూరివారివీధి, డోరు నెం. 17-1-26 అసెస్మెంట్ నెం. 1027006119. 112.4 చ.గ. లోని గ్రౌండుఫ్లోరు మరియు 1st ఫ్లోరు గల డాబా ఇంటికి హద్దులు: తూర్పు: మెయిన్ బజారు 11 అడుగులు, దక్షిణం: ఈ అయిటంకు పూరపాటి వెంకటేశ్వర్లు గారి అయిటంకు మధ్య జాయింటు గోడ హద్దు 92 అడుగులు, పడమర: ఈ అయిటంకు ఆవుల... ...అయిటంకు మధ్యగల జాయింటు గోడ హద్దు 11 అడుగులు, ఉత్తరం: ఈ అయిటంకు పెరుమాళ్ళ రాముల అయిటంకు మధ్య గల జాయింటు గోడ హద్దు 92 అడుగులు. ఈ హద్దుల మధ్యలోని 112.4 చ.గ.లోని స్థలము, ఇందులోని గ్రౌండ్‌ఫ్లోరు, ఫస్ట్‌ఫ్లోరులో గల డాబా ఇల్లు.

ఆసినా విలువ: రూ.50,00,000/-

D.H.R. విలువ: రూ.20,00,000/-

వేలము తేది: 17-07-2025

Further Hearing: 24-07-2025

పై వారి కోర్టులో ది.17-07-2025న బహిరంగ వేలం జరుపబడును. కావలసిన వారు హాజరై పాడుకొనవచ్చును.

// By Order of Court //

P.V. నరసింహ శాస్త్రి, అడ్వకేట్

సత్తెనపల్లి, సెల్ నెం: 9030104944

విత్తనాలు కృత్రిమ కొరత సృష్టించవద్దు

ఏవో సుబ్బారెడ్డి



విత్తన దుకాణంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఏవో సుబ్బారెడ్డి



గణపవరం విత్తనాల షాపులో రికార్డులు పరిశీలిస్తున్న ఏవో వెంకటనర్సయ్య

సత్తెనపల్లి: రైతులకు కావలసిన విత్తనాలు కృత్రిమ కొరత సృష్టించకుండా అందుబాటులో ఉంచాలని సత్తెనపల్లి మండల వ్యవసాయ అధికారి బి.సుబ్బారెడ్డి అన్నారు. పట్టణంలోని పలు విత్తన దుకాణాలు, ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాల్లో మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎవరైనా గ్రామాలలో గ్లీపోసేట్ బీటీ (హెర్బిసైడ్ టోలరెంట్) పత్తి విత్తనాల ప్యాకెట్లు లేదా విడిగా ఎటువంటి కంపెనీ పేరు లేకుండా అమ్మకాలు జరుపుతున్నట్లయితే అటువంటి వ్యక్తుల వద్ద రైతులు విత్తనాలు కొనుగోలు చేయవద్దన్నారు. అటువంటి వ్యక్తుల సమాచారం వ్యవసాయ శాఖకు తెలియజేయాలని సూచించారు. పట్టణంలోని విత్తన దుకాణదారులు తప్పకుండా విత్తన ధరల పట్టిక, రోజువారి విత్తన నిల్వల వివరాలు ప్రతి దుకాణంలో ప్రదర్శించాలని సూచించారు. రైతులకు విత్తన అమ్మకాల బిల్లులు ఇవ్వాలన్నారు. ప్రతి రైతు లైసెన్స్ ఉన్న డీలర్ వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. విత్తన డీలర్లు అధీకృత కంపెనీ నుండే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. డీలర్లు రైతులకు అధిక ధరలకు, అనుమతులు లేని విత్తనాలు విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణంలోని ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాలు తనిఖీ చేసి షాపు లేదా డీలర్ పేరు మీద బిల్లు లేకుండా ఎటువంటి విత్తనాలు వచ్చినా వ్యవసాయ అధికారి కార్యాలయంకు తెలియజేయాలని సూచించారు.

ఎమ్మార్పీ రేట్లకే విత్తనాలను అమ్మాలి

రాజుపాలెం: రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలని మండల వ్యవసాయాధికారి వెంకటనర్సయ్య తెలిపారు. మండలంలోని గణపవరం గ్రామంలో విత్తనాల షాపులలో మంగళవారం ఆయన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో స్టాకు రిజిస్టర్‌లో ఉన్న నిలువలు, బోర్డుపై ఉన్న నిలువలను పరిశీలించారు. ప్రభుత్వ అనుమతులు ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని షాపు యజమానులకు సూచించారు. విత్తనాలు కొన్న రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని, ఎమ్మార్పీ రేట్లకే విత్తనాలు అమ్మాలని ఏవో చెప్పారు.

